క్లుప్తంగా

మంత్రిని కలిసిన జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: రాష్ట్ర నూతన మంత్రిగా నియమితులైన అడ్లూరి లక్ష్మణ్‌ను సింగరేణి ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి మంత్రిగా నియమితులైన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వానికి, సింగరేణి కార్మికులకు మధ్య వారధిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కోరారు. ఆ యూనియన్ జనరల్ సెక్రెటరీ వికాస్‌కుమార్, సింగరేణి డీవైసీఎంఓ బాలకోటయ్య పాల్గొన్నారు.

హైటెక్‌సిటీలో దొంగతనం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో గల ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైటెక్‌సిటీ ఏషియన్ టవర్స్ బ్లాక్ నంబర్7, ఫ్లాట్ నంబర్ 76లో నివాసం ఉండే సుధాకర్ స్థానిక గ్రీన్‌సిటీలో నూతనంగా ఇల్లు కొనుక్కొని గృహప్రవేశం చేశాడు. ఈ నెల 6 నుంచి కొత్త ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. సోమవారం సుధాకర్ ఫ్లాట్ నంబర్ 76కు వచ్చి చూడగా మెయిన్ డోర్ తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించగా బెడ్‌రూమ్‌లోని రెండు బీరువాలు తెరిచి ఉన్నాయి. దీంతో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. రూ. 2లక్షల 49వేల విలువగల బంగారు ఆభరణాలు, 50గ్రాముల వెండి చోరీకి గురైనట్లు బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

బెల్లంపల్లి: తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని వార్డుల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 100రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాల్గో వార్డు బెల్లంపల్లి బస్తీలో తడి, పొడి చెత్తను ఏ తీరుగా వేరుచేయాలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యక్షంగా చేసి చూపి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, పర్యావరణ ఇంజనీర్ సంతోష్, మెప్మా టీఎంసీ దుర్గయ్య, సీవో కిశోర్ , ఆర్‌పీ సుజాత ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షకు 49మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సోమవారం 49మంది గైర్హాజరయ్యారు. సామాన్య శాస్త్రం పరీక్షకు 137మందికిగాను 88మంది హాజరయ్యారని డీఈవో యాదయ్య తెలిపారు.

పాతపద్ధతి పాటించండి

మంచిర్యాలఅర్బన్: గౌలిదొడ్డి, అలుగునూర్ గురుకుల కళాశాలలు(సీవోఈ) రెండో సంవత్సరం ప్రవేశాలకు పాత పద్ధతినే కొనసాగించాలని టీవీయూవీ, జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, వంశీ డిమాండ్ చేశారు. ఐపీఈ 2025మార్చిలో జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో 95శాతం మార్కులు వస్తేనే, సెంకండ్ ఇయర్లో కొనసాగిస్తామని నిబంధనలు పెట్టడం సరికాదన్నారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని పెంపొందించటంలో పాఠశాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం ఎంతో కీలకమని డీఈవో ఎస్.యాదయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల పారిశుద్ధ్యంపై ప్రతి మండలానికి ఇద్దరు చొప్పున రిసోర్సు పర్సన్‌లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. పాఠశాల పరిశుభ్రత, ఆవశ్యతకను వివరించారు. శిక్షణ పొందిన టీచర్లు, శానిటేషన్ వర్కర్లు ఈ నెల 10న మండల స్థాయిలో పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్లు శ్రీనివాస్, చౌదరి, సత్యనారాయణమూర్తి, రాజ్‌కుమార్, రిసోర్సు పర్సన్లు రవీందర్, నవ్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మంచిర్యాలలో స్థానిక ఎస్టీయూ భవన్‌లో సోమవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 79వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘం అభివృద్ధికి విశిష్ట సేవలందించిన శంకర్ గౌడ్, భీంరావు, కోటేశ్వర్‌రెడ్డిలతో పాటు నూతనంగా అదనపు ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్, మాధవిలను ఘనంగా సన్మానించారు. ప్రధాన కార్యదర్శి బాపు, అదనపు ప్రధాన కార్యదర్శి సుమన్, అసోసియేటెడ్ అధ్యక్షుడు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన రాజారాం

వేమనపల్లి: రాజారాం దశవతార క్షేత్రం వద్ద రెండోరోజు జాతర వైభవంగా జరిగింది. భక్తులు బోనాలు సమర్పించారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు





60ఏళ్ల క్రితం నిర్మించిన భీమారం మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఎందరినో తీర్చిదిద్దింది. ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత పదవుల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. కూలిపోయే దశకి చేరుకున్నా ప్రభుత్వం మాత్రం ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదు. కొన్ని తరగతి గదుల్లో పైకప్పు దెబ్బతింది. ఆ గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడకుండా తరగతి గదులను మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
– భీమారం



మందమర్రి పట్టణంలోని అంగడిబజార్ ప్రాంతానికి చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం ఆ బడి శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో అని భయాందోళన చెందుతున్నారు. పిల్లలను పంపించడానికి ప్రజలు జంకుతున్నారు. కొత్త పాఠశాలను నిర్మించాలని అధికారులు, ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. పాఠశాల గేట్ విరిగిపోయింది. ప్రమాదం జరుగక ముందే కొత్త భవనం నిర్మిస్తే బాగుంటుందని పిల్లల సంఖ్య కూడా పెరుగుతుందని స్థానికులు కోరుతున్నారు.
– మందమర్రిరూరల్

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- ఎంపీడీవో కార్యాలయం, చెరువు సమీపంలో వెలుస్తున్న గుడిసెలు

జన్నారం: మండల కేంద్రంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 374లో గల చెరువు ప్రాంతంలో ప్రభుత్వ భూమిపై కొందరు కన్ను వేశారు. ఆ ప్రాంతంలో ఇప్పటికీ చాలా వరకు కబ్జాకు గురైనట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఆ చెరువు ప్రాంతంలో అంబేడ్కర్ భవనానికి వెళ్లే దారిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుగా గోడ నిర్మించారు. ఈ విషయంపై అంబేడ్కర్ సంఘం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడంతో పాటుగా ఆందోళన చేయడంతో అధికారులు గోడ కూల్చివేశారు. అదే ప్రాంతంలో కొందరు అక్రమంగా గుడిసెలు వేసుకున్నారు. చుట్టూ తడకలు కట్టుకొని, పైన రేకులు వేశారు. అయితే ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అడ్డుకున్నారు. అయినా ఇంకా రెండు గుడిసెలు అక్కడే ఉన్నాయి. ఎంపీడీవో కార్యాలయం వెనుకాలే గల ఈ చెరువు వెనుక భాగం కట్టపై అక్రమ నిర్మాణాలు జరగడం గమనార్హం.

హైడ్రాకు ఫిర్యాదు..

చెరువులో అక్రమ నిర్మాణాలపై మండలానికి చెందిన కొందరు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. మండలానికి చెందిన కొందరు కావాలనే ఈ భూమిని అమ్ముతున్నట్లు సమాచారం. కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన కొందరికి ఈ ప్రభుత్వ భూమిలో ఇళ్లను నిర్మించుకునేందుకు స్థానికులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బులు వసూలు చేసి, ఈ ప్రాంతంలో తక్కువ ధరకు భూమి ఇచ్చే యత్నం చేస్తున్నారు. అధికారులు ఈ విషయంపై దృష్టి సారిస్తే మరిన్ని విషయాలు బయటకొచ్చే అవకాశాలున్నాయి. గతంలో కూడా ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకునే యత్నం చేస్తే అధికారులు కూల్చివేశారు. తిరిగి ఇదే ప్రాంతంలో గుడిసెలు వేసుకునేందుకు స్థానికులు యత్నిస్తున్నారు.



కబ్జాకు గురవుతున్న చెరువు

పలు చెరువులు ఆక్రమణ..

మండలంలోని పొనకల్, కిష్టాపూర్, కవ్వాల్ తదితర చెరువులు ఆక్రమణకు గురవుతున్నట్లు తెలుస్తోంది. చెరువుల కబ్జాపై పలువురు అధికారుల కు ఫిర్యాదు చేశారు. గత సంవత్సరం చెరువుల కబ్జా గురించి ఆరోపణలు రావడం, అధికారుల కు ఫిర్యాదు చేయడంతో సర్వే చేశారు. అధికారులు దృష్టి సారించి, మండలంలోని అన్ని చెరువులపై సర్వే నిర్వహించి, చెరువులకు హద్దులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కబ్జా నుంచి కాపాడాలి



చెరువులోని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి కొందరు యత్నిస్తున్నారు. చెరువు కట్ట పై ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గుడిసెలు వేసుకున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లా. అధికారులు గుడిసెలను అడ్డుకున్నారు. అయితే కొందరు ఇంకా గుడిసెలు వేసుకునే ఉన్నారు. స్థానికులు కొందరు ఈ భూమిని అమ్ముకునే యత్నం చేస్తున్నారు. వ్యాపారం గోప్యంగా చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు దృషి పెట్టి, కబ్జా జరగకుండా చూడాలి.
– ముల్కల్ల ప్రభాకర్, స్థానికుడు

గుడిసెలు తొలగించాం

చెరువు సమీపంలో ప్రభుత్వ భూమిలో కొందరు గుడిసెలు వేసే ప్రయత్నం చేశారు. సమాచారం తెలియగానే మా సిబ్బందితో గుడిసెలు తొలగించాం. ఈ విషయంలో కొందరు అనవసర ప్రచారం చేస్తున్నారు. ఎలాంటి కబ్జా జరగలేదు. ఆక్రమణ చేయాలని ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– రాజమనోహర్ రెడ్డి, తహసీల్దార్

ముగిసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ మంచిర్యాల క్లబ్‌లో స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముఖేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, స్వరూప ఆసుపత్రి డాక్టర్ శరత్‌బాబు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ డీజీయం పంతుల, క్లబ్ ట్రెజరర్ పురుషోత్తం జాజు, పీడీ మీనారెడ్డి, లక్ష్మీనారాయణ, కృష్ణ, మధు, రవి, గోపాల్, రవికుమార్, నందం శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, కబీర్‌దాస్, కిషోర్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్–11 బాలికల సింగిల్స్‌లో శ్రీహ కందికట్ల, త్విష ఉప్పల, అండర్–11 బాలుర విభాగంలో శరవన్, అర్జున్, అండర్–11 బాలికల డబుల్స్‌లో త్విష, శ్రీహ, హర్షిత, మినీ బాలుర డబుల్స్‌లో అర్జున్, అమన్, ఆరుష్, శశిధర్, అండర్–13 బాలికల సింగిల్స్‌లో ఏ.ఆరాధ్య, కే.సహస్ర, అండర్ 13 బాలుర విభాగంలో శ్రీహర్షిత్, సుహిత్, బాలుర డబుల్స్‌లో సుహిత్, అక్షిత్, గౌతమ్, సాత్విక్‌లు గెలుపొందారు. అండర్ 15బాలికల సింగిల్స్‌లో ఏ.ఆరాధ్య, ఈ.విష్ణుశ్రీ, బాలుర సింగిల్స్‌లో ధనుష్, జస్వంత్, బాలికల డబుల్స్‌లో ఆరాధ్య, విష్ణుశ్రీ, సహస్ర శ్రీ, ప్రతిభ, బాలుర డబుల్స్‌లో గౌతమ్, రానా, సుహాస్, హర్షిత్, మిక్స్‌డ్ డబుల్స్‌లో గౌతమ్, హంషిత, ఆరాధ్య, శ్రీహర్షిత్, అండర్ 17 బాలుర సింగిల్స్‌లో ధనుష్, రిజ్వాన్, బాలికల సింగిల్స్‌లో జి. అనన్య, కె. సహస్ర, బాలుర డబుల్స్‌లో ఆర్. బన్నీ, బి.అఖిల్, గౌతమ్, గుణలు గెలుపొందారు. అండర్ 19 బాలుర సింగిల్స్‌లో జి.రాము, బి.ఆదిత్య, హర్షవర్ధన్, బాలికల సింగిల్స్‌లో జి.అనన్య, బాలుర డబుల్స్‌లో పి. ఆకాశ్, విష్ణు నారాయణ, జి. రితిన్, రుద్రప్రతాప్, మెన్ సింగిల్స్‌లో బి. ఆదిత్య, హర్షవర్ధన్, భీమ్‌రావు, మెన్ డబుల్స్‌లో సాయికుమార్, భీమ్‌రావు, సాయి, రిజ్వాన్, ఉమెన్ సింగిల్స్‌లో జి. ఆరాధ్య, రిస్లీనాలు గెలుపొందారు.



గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పని చేయాలి

- సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో...
- ఎమ్మెల్యే బొజ్జు పటేల్, టీపీసీసీ పరిశీలకులు రాం భూపాల్, అవేశ్

జన్నారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జుపటేల్, టీపీసీసీ పరిశీలకులు రాం భూపాల్, అవేశ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సంస్థాగత, నిర్మాణ సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ 10యేళ్లు అధికారంలో ఉండి చేసింది శూన్యమన్నారు. రైతులను ఆదుకునే కడెం ప్రాజెక్టుకు గ్రీసు పూయడానికి కూడా డబ్బులు ఇవ్వలేదని, తూతూ మంత్రంగా పనులను చేసి కడెం ప్రాజెక్టును ప్రమాదంలో పడేశారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని రోజులలోనే రూ.9.46కోట్లను మంజూరు చేసి, ప్రాజెక్టుకు పునర్జీవం పోసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. కష్టపడిన ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు రాజశేఖర్, మోహన్‌రెడ్డి, శుభాష్‌రెడ్డి, ఇసాక్, ఇందయ్య, రమేశ్, రాజన్న, వెంకటరాజం, అజార్, షాకీర్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అభివృద్ధిని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: గత ప్రభుత్వ హయాంలో వివిధ అభివృద్ధి పనులకు విడుదలైన నిధులను వినియోగించుకోకుండా, వాటిని వెనక్కి మళ్లించి పట్టణ అభివృద్ధిని ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అడ్డుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. నస్పూర్‌లోని వినూత్న కాలనీలో సోమవారం ఆయన పర్యటించారు. తమ ప్రభుత్వం హయాంలో వినూత్నకాలనీలో తోళ్లవాగుపై రాకపోకలకు అనుగుణంగా రూ.80లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణ పనులను రద్దు చేశారని ఆరోపించారు. బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన సీసీసీ సుందరయ్య కాలనీలోని వారసంత వద్ద అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న దివాకర్‌రావు

షెట్టర్ల కేటాయింపులో అవినీతి, అక్రమాలు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సమీకృత కూరగాయల మార్కెట్ సముదాయంలో నిర్మించిన షెట్టర్ల కేటాయింపులో అవినీతి, అక్రమాలు జరిగినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ.అఫ్జల్, మాజీ కౌన్సిలర్లు పొట్ల సురేష్, బైరి శ్రీనివాస్ తదితరులు సోమవారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు ఫిర్యాదు చేశారు. మార్కెట్ షెట్టర్ల కేటాయింపులు నిబంధనల ప్రకారం జరగలేదని, అసలు మార్కెట్‌కు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులకు షెట్టర్లను కట్టబెట్టారని ఆరోపించారు. ఈ షెట్టర్ల కేటాయింపు వెనకాల అవినీతి దందా సాగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనర్హులకు షెట్టర్లు కేటాయించి అవకతవకలకు పాల్పడిన మున్సిపల్ అధికారులపై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. లబ్ధిదారుల ఎంపిక, అవినీతి అక్రమాలపై నిజనిర్ధారణ కమిటీ వేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు దేవసాని ఆనంద్, ఆడేపు మహేష్, రాచకొండ గోవర్ధన్‌రావు, తిప్పని రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఇన్‌స్పైర్ నామినేషన్ల దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: ఇన్‌స్పైర్ నామినేషన్ల కోసం జూన్ 15నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక, వినూత్న ఆలోచనలను పెంపొందించే లక్ష్యంతో సైన్స్, టెక్నాలజీ మంత్రిత్వశాఖ అమలు చేసే కార్యక్రమం ఇన్‌స్పైర్ మనక్ అన్నారు. 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులు ఇన్‌స్పైర్‌లో పాల్గొనవచ్చన్నారు. ప్రతీ పాఠశాల, కళాశాల నుంచి 5 ప్రాజెక్టులు నామినేషన్లకు అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలన్నారు.

విధి నిర్వహణలో రక్షణే ప్రథమం

మందమర్రిరూరల్: విధి నిర్వహణలో ఉద్యోగులు రక్షణే ప్రథమంగా విధులు నిర్వర్తించాలని ఏరియా జీఎం దేవేందర్ సూచించారు. ఏరియాలోని వర్క్‌షాపులో ఫాటర్ ఫ్రీ జూన్ మాసంగా మార్చడానికి సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జీఎం మాట్లాడారు. ఉద్యోగులు ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా రక్షణతో పనిచేయాలన్నారు. ఉద్యోగుల రక్షణ సంస్థ బాధ్యతని, ఉద్యోగి రక్షణపైనే వారి కుటుంబ రక్షణ ఆధారపడి ఉంటుందని గుర్తుచేశారు. అనంతరం ఉద్యోగులతో కలిసి జీఎం రక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఏరియా ఏజీఎం (ఈఅండ్ఎం) వెంకటరమణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, వర్క్‌షాప్ ఇన్‌చార్జి ధూప్‌సింగ్, ఏఐటీయూసీ నాయకులు, వర్క్‌షాపు ఉద్యోగులు ఉన్నారు.



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం దేవేందర్

సింగరేణి ఆసుపత్రుల్లో మందుల కొరత తీర్చాలి

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): సింగరేణి ఆసుపత్రుల్లో మందుల కొరత తీర్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, మందమర్రి బ్రాంచీ కార్యదర్శి సలేంద్రనారాయణ, రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలోని డీవైసీఎంఓ ప్రసన్నకుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రూ.కోట్ల లాభాలు గడిస్తున్న కంపెనీలో మందుల కొరత సరికాదని, యాజమాన్యం వెంటనే స్పందించి మందులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ నాయకులు ఇప్పకాయల లింగయ్య, సుదర్శన్, సంపత్ అఫ్రోజ్ ఖాన్, అద్దు శ్రీనివాస్ పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంవోకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

■ బొగ్గుబాయి వార్తలు

ఏరియాలోని ఉద్యోగుల సర్దుబాటు

- జీఎం శ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: త్వరలో మూసివేయబోతున్న ఆర్కే 6 గనిలోని ఉద్యోగులను శ్రీరాంపూర్ ఏరియాలోనే సర్దుబాటు చేయనున్నట్లు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియాలోని ముఖ్య డిపార్టుమెంట్ల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. గనిలోని యంత్రాలు, యంత్ర పరికరాలను తరలించడానికి చేయాల్సిన ఏర్పాట్లను సూచించారు. ఉద్యోగుల సర్దుబాటుకు చేయాల్సిన ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్‌లు కుర్మా రాజేందర్, వెంకటేశ్వర్లు, ఇందారం ఓపెన్‌కాస్ట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, రవీందర్, మల్లయ్య ఐటి అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

తాండూర్/దండేపల్లి/వేమనపల్లి: నిరుపేదలకు వరం ఇందిరమ్మ ఇళ్ల పథకం అని ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి అన్నారు. దండేపల్లి మండలంలోని మామిడిపల్లి, కొత్తమామిడిపల్లి, మాకులపేటలో ఇళ్ల నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేసి, నిర్మాణ పనులు ప్రారంభించారు. వేమనపల్లి మండలం కళ్లెంపల్లిలో ఇళ్ల పురోగతిని మండల ప్రత్యేక అధికారి, ఏడీఎస్ఎల్ఆర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. తాండూర్ మండలంలోని నీలాయపల్లిలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో, తాండూర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ శంకర్, జిల్లా గ్రంథా లయ సంస్థ మాజీ చైర్మన్ మహేందర్ రా వు, మాజీ జెడ్పీటీసీ బానయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి, భూమిపూజ చేశారు.

కొనసాగుతున్న బడిబాట

కోటపల్లి/భీమారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం కోటపల్లి జెడ్పీహెచ్ఎస్, భీమారం సమీపంలోని బీసీ కాలనీ పాఠశాల, హాజీపూర్ మండలంలో బాబర్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో తిరుపతిరెడ్డి హాజరయ్యారు.